చట్టాలపై అవగాహన అవసరం

శ్రీశైలంప్రాజెక్ట్: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐడీ ఇన్‌స్పెక్టర్లు ఎస్.నగేష్‌బాబు, జి.పెద్దయ్య నాయుడు, శ్రీశైలం వన్‌టౌన్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాదరావు, చంద్రబాబు సూచించారు. మంగళవారం సున్నిపెంటలోని యూత్‌ట్రైనింగ్ సెంటర్‌లో చట్టాలపై రాష్ట్ర క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఎస్టీలు అడవుల్లో, లోతట్టు ప్రాంతాల్లో సమాజానికి దూరంగా జీవిస్తారన్నారు. ఎస్సీలు కూడా ప్రత్యేక వాడలు, పల్లెల్లో జీవిస్తూ ఉన్నారన్నారు. ప్రత్యేక చట్టాలపై అవగాహన పెంచుకుని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యాంగ సవరణల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. సమాజంలో వివక్షకు గురికాకుండా వాటిని ఉపయోగించుకుని, తమ ప్రయోజనాలను కాపాడుకోవాలన్నారు. చట్టాలపై ప్రతిభ కనబరిచిన ముగ్గురిని అధికారులు అభినందించారు. కార్యక్రమంలో నంద్యాల స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణయ్య, ఐటీడీఏ ఏపీఓ ఎ.సురేష్‌కుమార్, తహసీల్దార్ కె.వి.శ్రీనివాసులు, ఐటీడీఏ స్టేట్ గవర్నింగ్‌బాడీ సభ్యులు కుడుముల మూగెన్న, ప్రిన్సిపాళ్లు కిశోర్‌బాబు, బి.అమృత్‌కుమార్, హార్టికల్చర్ అధికారి బి.సి.ధనుంజయ పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సీఐ

రబీ పంటలకు బీమా చేయించుకోండి

జూపాడుబంగ్లా: రబీలో పంటలు సాగుచేసిన రైతులు డిసెంబర్ 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తర్తూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడటం తగ్గించుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా రసాయనిక ఎరువులు వాడుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. సర్పంచ్ నాగిరెడ్డి, సెరికల్చర్ టీఏ కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.


కంది పంటలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ

శ్మశాన సమస్యలపై వినతి

జూపాడుబంగ్లా: కలెక్టర్ కేటాయించిన నూతన శ్మశానవాటికలో అంత్యక్రియలు చేసుకునేలా చూడాలని 80బన్నూరు గ్రామానికి చెందిన దళితులు మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణను కోరారు. గ్రామంలోని పాతశ్మశానవాటిక స్థలం నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో పోయింది. నూతన శ్మశానవాటిక కోసం దరఖాస్తు చేసుకోగా గ్రామంలోని సర్వేనంబర్ 126/ఏలో 2.22 ఎకరాలు రస్తా పోరంబోకు పొలానికి పొందిన పట్టాలను కలెక్టర్ రాజకుమారి గణియా రద్దు చేశారు. ఆ పొలాలను దళితుల శ్మశాన వాటికకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టాలు రద్దు చేస్తూ కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వుల కాపీలను ఇరువర్గాల వారికి అందజేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ఆన్‌లైన్‌లో పట్టాలు పొందిన వారి పేర్లను తొలగించి శ్మశాన వాటికకు కేటాయించినట్లుగా నమోదు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అంత్యక్రియలు నిర్వహించుకునేలా చేయాలని గ్రామానికి చెందిన దళితులు ఎస్ఐను కోరారు. త్వరలో గ్రామసభను నిర్వహించి శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరుపుకునేలా చేస్తామని ఎస్ఐ తెలిపారు. అప్పటి వరకు పాత శ్మశాన వాటికలోనే అంత్యక్రియలు జరుపుకోవాలని సూచించారు. అలాగే 80బన్నూరు రెవెన్యూ పరిధిలో ఉన్న ముస్లింల శ్మశాన వాటికలో పంటకాల్వ తవ్వరాదని ముస్లింలు ఆందోళన చేపట్టగా తహసీల్దార్, నేషనల్‌హైవే అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

ఆత్మకూరు: ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్ సూచించారు. అమలాపురం చెంచుగూడెంలో జరిగిన పార్టీ మండల మూడో మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారికి దన్నుగా నిలవాలన్నారు. మహాసభలో పార్టీ మండల కార్యదర్శి నరసింహానాయక్, మండల నాయకులు సుధాకర్, మాబాషా, సి.వెంకటేశ్వర్లు, మల్లికార్జున, మాబాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

వెలుగోడు: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ ఆంజనేయ సూచించారు. మండలంలోని గుంతకందాల గ్రామంలో ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఇండ్ గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ 40 మంది రైతులను మన ఊరి నేస్తాలు అనే రైతు ఉత్పత్తిదారుల సంఘం అనుసంధానం చేసి 20 హెక్టార్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తక్కువ సాగు ఖర్చుతో అధిక దిగుబడులు, అధిక ఆదాయం పొందడం, రైతును తన పొలంలో స్వయం నిర్ణయాధికారిని చేయడం ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మిత్ర పురుగులను సంరక్షించుకుంటూ, రసాయనిక పురుగు మందులు, ఎరువులను తగ్గించి, సేంద్రియ పదార్థాల వాడకంతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి పొలంబడి ఉపయోగపడుతుందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను సాధిస్తూ ఇల్లు క్యాప్ సర్టిఫికెట్ పొందడం వల్ల రైతులు ఎగుమతి ప్రణాళిక అనుగుణంగా పంట నికర ఆదాయం పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అజిత్ కుమార్ రెడ్డి, విస్తరణ సిబ్బంది అప్సర అలీ, రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈఓ హరీష్ పాల్గొన్నారు.


పంట పొలాల్లో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

ఉపాధి పనులు పరిశీలన

వెలుగోడు: మండల పరిధిలోని గుంతకందాల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లను ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. మంగళవారం ఉపాధి పనుల తోపాటు హౌస్ జియో ట్యాగింగ్, ఎన్‌పీసీఐ సర్వేలు త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ సచివాల సిబ్బందికి సూచించారు. సచివాలయంలో అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. బయోమెట్రిక్ అటెండెన్స్ ఇన్ టైంలో వేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి ప్రవీణ్ నాయక్ ఉన్నారు.


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఘనంగా బోనాల పండుగ

వెలుగోడు: పట్టణంలోని మత్స్యకారులు మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను తలపై పెట్టుకుని డప్పు వాయిద్యాల మధ్య, బాణా సంచా పేలుళ్ల సంబరాలతో ర్యాలీగా గంగమ్మ ఒడ్డుకు చేరుకున్నారు. అక్కడ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం కావడంతో సామూహిక వనభోజనాల్లో పాల్గొన్నారు.


బోనాలతో ర్యాలీగా వెళ్తున్న మత్స్యకారులు

డీలర్ కుటుంబానికి పరామర్శ

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో రేషన్ డీలర్ వెంకటేశ్వర్లు(50) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. చౌకదుకాణం డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు నాగభూషణంరావు, నాగేశ్వరరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీఆర్వో ముర్తుజావలి, డీలర్లు బుజ్జన్న, సునీల్, శేఖర్, నరసింహులు పాల్గొన్నారు.

మదర్సాలో కంప్యూటర్ తరగతులు

ఆత్మకూరు: మదర్సా అరబిక్ కళాశాలలో చదివే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుంటామని ఆత్మకూరు పెద్ద మదర్సా మదీనాతుల్ ఉలుమ్ అధ్యక్షులు, కమిటీ అధ్యక్షులు ఎం.ఎ.రషీద్ తెలిపారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఆయన ఆరు నెలల కంప్యూటర్ క్లాసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు టెక్నాలజీ నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆరు నెలలపాటు కంప్యూటర్ శిక్షణ ఇస్తామన్నారు. అర్హులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అరబిక్ కళాశాలలో చదివే ప్రతి విద్యార్థికి అన్ని విధాలా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రస్తుతం 8 కంప్యూటర్లు ఏర్పాటు చేసి ప్రతిరోజూ కంప్యూటర్ ఫ్యాకల్టీ చేతుల మీదుగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముర్తుజా మౌలానా, మద్రాస కమిటీ ఉపాధ్యక్షులు అబ్దువహాబ్, సెక్రటరీ మస్తాన్‌వలి, సోఫీసా, ఎస్.టి.హఫీజ్‌సామెబ్, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

మహానంది: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని మహానంది తహసీల్దార్ రమాదేవి సూచించారు. బొల్లవరం గ్రామంలోని సచివాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మెనూ ప్రకారమే భోజనం

పగిడ్యాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ అన్నారు. మంగళవారం స్థానిక 5వ అంగన్‌వాడీ సెంటర్‌ను ఎంపీడీఓ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, జనన, మరణాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్రానికి వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పోషకాహారం, పాలు, కోడిగుడ్లు, చిక్కీలు ఇవ్వాలన్నారు. కేంద్రంలో పిల్లలకు నేర్పించే ఆట,పాట విద్యపై ఆరా తీశారు. అనంతరం ఇంటింటి సర్వే జియో ట్యాగింగ్, ఎన్పీసీఐ సర్వే పురోగతిని పరిశీలించి సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు.


పిల్లలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం మంగళవారం బెంగళూరుకు చెందిన భక్తురాలు వసుధారాణి దర్శనం అనంతరం పర్సును పోగొట్టుకుంది. ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులకు దొరకగా వారు స్థానిక హోంగార్డు శివరాం, లాకర్ల వద్ద ఉన్న లక్ష్మణ్‌లకు అందించారు. వారు పర్సును బాధిత భక్తురాలికి అందించడంతో ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

వైభవంగా ఆరుద్రోత్సవం

మహానంది: ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని మహానందిలో మంగళవారం పూజలు వైభవంగా జరిగాయి. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ మహానందీశ్వరస్వామికి అన్నాభిషేకం పూజలు చేపట్టారు. విజయ్‌కుమార్, పద్మజ దంపతులు దాతలుగా వ్యవహరించార. పూజా కార్యక్రమాల్లో ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా కార్తీకమాసం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలని వినతి

పాములపాడు: మండలంలోని క్రిష్ణారావుపేట, తుమ్మలూరు గ్రామస్తులకు చెందిన శ్మశాన వాటిక జాతీయ రహదారి నిర్మాణంలో పోతుందని.. సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా నాయకులు రమేష్‌బాబు, ప్రతాప్ జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. మంగళవారం పనులను పరిశీలించిన కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించారు. రుద్రవరం గ్రామంలోని ప్రైమరీ పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని కోరారు.

దివ్యాంగుల సంఘం నాయకుడు మృతి

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో దివ్యాంగుల సంఘం జిల్లా నాయకుడు కూన చిన్ననాగన్న(32) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. గ్రామ మాజీ సర్పంచ్ టీకూరి రామసుబ్బమ్మ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

22 వరకు మొబైల్ ఆధార్ సేవలు

జూపాడుబంగ్లా: కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న మొబైల్ ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ నూర్జహాన్ అన్నారు. మంగళవారం మండలంలోని పోతులపాడు గ్రామంలో మొబైల్ ఆధార్ సెంటర్‌ను నిర్వహించగా విద్యార్థులు, గ్రామస్తులు ఆధార్‌కార్డుల్లో పేర్లు, పుట్టినతేదీ, చిరునామా, తదితర వివరాల చేర్పులు, మార్పులు చేయించుకున్నట్లు తెలిపారు. 20న తంగడంచ, 21న మండ్లెం-1, 22న తర్తూరు గ్రామాల్లో మొబైల్ ఆధార్ సెంటర్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు దండోరా వేయించి గ్రామస్తులకు తెలియజేయాలని ఆదేశించారు.

అన్నదానం

కార్తీక మాసం పురస్కరించుకుని శివ మాల, అయ్యప్ప మాల ధారులకు మంగళవారం స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా అన్నదానం ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వామి ఆలయంలో శివ, అయ్యప్పస్వాములకు స్వయంగా అన్నం వడ్డించారు. -ఆత్మకూరు



ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం


నందికొట్కూరు: పోస్టర్ ప్రదర్శిస్తున్న దృశ్యం


కొత్తపల్లి: ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

నందికొట్కూరు: మరుగుదొడ్డి వాడుదాం ఆత్మగౌరవాన్ని కాపాడుకుందామని డ్వామా జిల్లా మానిటరింగ్ ఎవాల్యూవేషన్ ఏపీడీ భాస్కర్ నాయుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని నిర్వహించారు. డిసెంబర్ 10వ తేదీ వరకు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. మరుగుదొడ్ల మరమ్మతుల కార్యచరణను నిర్వహించడం, వ్యక్తిగత, కమ్యూనిటీ మరుగుదొడ్లను సుందరీకరించడం జరుగుతుందని చెప్పారు. ఆత్మగౌరవం, ఆరోగ్యం కోసం మరుగుదొడ్డి నిర్మించుకోవాలని కోరారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం, డ్వామా ఏపీడీ అన్వర్‌బేగం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వనాథ్ పాల్గొన్నారు.

బహిరంగ మల విసర్జన చేయొద్దు

మిడుతూరు: బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయొద్దని ఎంపీడీఓ దశరథరామయ్య అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

పాములపాడు: బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. ఏఎస్ఆర్ జెడ్పీ హెచ్‌స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రంగనాయక్, ఏఈఆర్‌డబ్ల్యూఎస్ సువర్చల, ఎంసీఓ చెంచయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు బహిరంగ మల విసర్జన చేయరాదని మరుగుదొడ్లను తప్పనిసరిగా వాడాలని ఎంపీడీఓ దాసరి మేరీ, గోకవరం వైద్యాధికారి విజయేంద్ర తెలిపారు. గోకవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించారు. ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంఈఓ ఇనయతుల్లా, పంచాయతీ కార్యదర్శి ప్రవంతి పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి నివాళి

పాములపాడు: మహిళలు ఎందులోనూ తక్కువ కాదని అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆయుర్వేద వైద్యాధికారిణి సావిత్ర అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని.. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. లైబ్రేరియన్ క్రిష్టారెడ్డి, వార్డు సభ్యురాలు శ్రీలత పాల్గొన్నారు.

పగిడ్యాల: ఇందిరాగాంధీ సేవలు ఎనలేనివని లైబ్రేరియన్ మద్దమ్మ అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహనీయులను మననం చేసుకోవడం పౌరులుగా మన కర్తవ్యమని తెలిపారు.

● వెలుగోడు: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఇందిరా గాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇందిరాగాంధీ చిత్రపటానికి వైద్యాధికారిణి పద్మావతమ్మ, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నళిని పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మీబాయి సేవలను కొనియాడారు. లైబ్రేరియన్ సుమలత పాల్గొన్నారు.

● శ్రీశైలంప్రాజెక్ట్: ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని సున్నిపెంట బస్టాండ్‌లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆసార్ సయ్యద్ ఇస్మాయిల్ నాయకులు వెంకటయ్య, దర్శనం చిన్నయ్య, శ్రీరాం, రమణ, సోమన్న, చెంచన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● బండిఆత్మకూరు: జాతీయ గ్రంథాలయ ఉత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి స్థానిక గ్రంథాలయంలో మహిళా పాఠకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి మధు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న వైద్యాధికారిణి, పాఠకులు


ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మహిళలు

స్థల వివాదాలపై అధికారుల విచారణ

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని ప్రభుత్వ స్థలాల్లో జరుగుతన్న అక్రమ కట్టడాలపై అధికారులు విచారణ చేపట్టారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.సుధారాణి మంగళవారం సున్నిపెంటకు చేరుకున్నారు. ఆక్రమణదారులు, ఫిర్యాదుదారులతోనూ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆధారాలు ఉంటే సమర్పించాలని వారికి సూచించారు. స్థల కేటాయింపుల వివరాలను సమర్పించాలని జలవనరుల శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. హై ట్రాన్స్‌మిషన్ విద్యుత్ లైన్ల కింద జరుగుతున్న ఇరువురి కట్టడాలను పరిశీలించి డిప్యూటీ కలెక్టర్ విష్మయం చెందారు. ఇటువంటి కట్టడాలతో భవిష్యత్‌లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆమె తెలిపారు. విచారణలో తహసీల్దార్ శ్రీనివాసులు, పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ భోయేజ్ రాజు, డీడీఓ బాలూనాయక్, కార్యదర్శి నాగార్జున, జలవనరుల శాఖ అధికారులు తంగరాజ్, ఇస్మాయిల్ ఉన్నారు.

ఓటరుగా నమోదు కండి

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, శ్రీశైలం నియోజకవర్గ ఎన్నికల అధికారిణి కె.సుధారాణి సూచించారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోల్ పార్టిషిపేషన్ కార్యక్రమాన్ని మంగళవారం సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ 17 సంవత్సరాలు నిండిన యువతను ప్రీ ఓటర్‌గా నమోదు చేసే సంస్కరణను తీసుకు వచ్చిందన్నారు. దీనిలో పేరు నమోదు చేయించుకుంటే 18 ఏళ్లు నిండగానే ఆటోమేటిక్‌గా ఓటరుగా నమోదవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ పి.హుస్సేన్‌బాషా, అధ్యాపకులు మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


ఇరువర్గాలతో చర్చిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈఓ, తహసీల్దార్

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.


పూజలందుకున్న కుమారస్వామి

యూనిఫాం పంపిణీ


యూనిఫాం ధరించిన ఎకో - టూరిజం సిబ్బంది

ఆత్మకూరురూరల్: ఎకో – టూరిజం రిసార్ట్ మంగళవారం ఎఫ్ఆర్ఓ దొరస్వామి యూనిఫారం పంపిణీ చేశారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని ఎఫ్ఆర్వో సిబ్బందికి సూచించారు.

బొలేరో వాహనం బోల్తా

మహానంది: మండలంలోని అబ్బీపురం గ్రామం సమీపంలో మంగళవారం అరటి గెలల లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం బోల్తా పడిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. కృష్ణనంది నుంచి వస్తుండగా అదుపు తప్పి వాహనం తిరిగి పడింది. అదృష్టవశాత్తు డ్రైవర్ అశోక్ ప్రమాదం నుంచి బయపడినట్లు స్థానికులు తెలిపారు.

క్లుప్తంగా

అడిగిన వారందరికీ ఉపాధి పనులు


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నందికొట్కూరు: గ్రామీణ ప్రాంతాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మల్యాల, బిజినవేముల గ్రామాల పొలిమేరలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా నిబంధనల ప్రకారం పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరులో సాగు చేసిన పొగాకు పంటను వ్యవసాయశాఖ డివిజన్ స్థాయి అధికారి విజయశేఖర్ మంగళవారం పరిశీలించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా పంటలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వివిధ పంటలకు తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ధీశాలి ఝాన్సీలక్ష్మీబాయి


నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పగిడ్యాల: బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ధీశాలి ఝాన్సీలక్ష్మీబాయి అని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి కుమ్మరి నాగరాజు అన్నారు. మంగళవారం పాత ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. విద్యార్థినులు ఝాన్సీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ధైర్య సాహసాలను అలవర్చుకోవాలన్నారు. హెచ్‌ఎం కౌసల్యబాయి, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

ఆత్మకూరు: వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని డీఆర్‌సీ ఏఓ హేమలత, ఉద్యానవన శాఖ అధికారి చందన, వ్యవసాయశాఖ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మండలంలోని శ్రీపతిరావుపేట, పిన్నాపురం గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.36 లక్షలు మంజూరు

జూపాడుబంగ్లా: మండలంలోని రామసముద్రం గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి ఈనెల 21న శ్రీకారం చుట్టనున్నట్లు ఏఓ కార్తీక్ తెలిపారు. ఆలయానికి 18 ఎకరాల మాన్యం భూములుండగా కౌలు ద్వారా ఏటా సుమారు రూ.5 లక్షల ఆదాయం సమకూరుతున్నట్లు చెప్పారు. ఆలయం శిథిలం కావడంతో విషయాన్ని దేవదాయశాఖ దృష్టికి తీసుకెళ్లగా రూ.36 లక్షల సీజీఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో శ్రీముక్తా కన్‌స్ట్రక్షన్స్ అధ్వర్యంలో నూతన ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన

బండిఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన గొర్రెల షెడ్ల నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ఎం. దస్తగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రెండు పశువులున్న లబ్ధిదారులకు రూ.1,50,000, నాలుగు ఉన్నవారికి రూ.1,85,000, 50 గొర్రెలు ఉన్న వారికి రూ.2,30,000 మంజూరైనట్లు తెలుపుతూ, కొలతల పట్ల అవగాహనను, నిర్మాణ క్రమాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ వసుధ పాల్గొన్నారు.

భూముల పరిశీలన

కొత్తపల్లి: కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 167కే జాతీయ రహదారి నిర్మాణం కోసం అవసరమైన భూములను తహసీల్దార్ ఉమారాణి మంగళవారం పరిశీలించారు. మండల పరిధిలోని శివపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని పొలాలను పరిశీలించి రైతుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంగమేశ్వరం నుంచి దుద్యాల వరకు సుమారు 231 ఎకరాల్లో జాతీయ రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. జాతీయరహదారి నిర్మాణం సమగ్ర వివరాలను డీటీ పెద్దన్న తహసీల్దార్‌కు వివరించారు. భూములు కోల్పోయిన రైతులకు త్వరలో పరిహారం మంజూరుకానున్నట్లు చెప్పారు. పరిహారం మంజూరైన వెంటనే పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. శివపురం గ్రామ పరిధిలో రహదారి నిర్మాణానికి ఏడు ఎకరాల భూమి సేకరించామన్నారు.